


# కన్నెమనసు

రావిపల్లి నారాయణరావు

**కుండపోతగా** కురుస్తూంది వర్షం. ఉరుములు మెరుపులతో దద్దరిల్లిపోతూంది ఆకాశం. రాత్రి పదకొండు గంటల సమయం. పూర్తిగా రాజ్యం చేస్తూంది నిశ్శబ్దం. ఈదురు గాలి జోరుకు తట్టుకోలేక తలుపులు మూసుకుని దుప్పటి ముసుగులో నిద్ర తీస్తున్నారు జనం.

''ఇంతవరకు మీరు సినిమా పాటలు విన్నారు... ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం—సమయం పదకొండు గంటలు...ఇంతటితో ఈ ప్రసారం సమాప్తం'' సెలవు తీసుకుంది రేడియో కేంద్రం.

కథ రాయటానికని కుర్చీలో కూర్చుని గంట దాటింది. కాని ఎందుకో ముందుకు సాగలేదు కలం. రేడియోలో పాటలు వింటూ కథ రాయడం మొదటి నుండి అలవాటు నాకు. పాటలు ఆగిపోవటంతో మెదడు మరీ మొద్దుబారిపోయింది. ఎంత ఆలోచించినా మనస్సు కథ మీద లగ్నం కాలేదు. కళ్ళు మూసినా, కళ్ళు తెరచినా ప్రసూన కళ్ళముందు మెదలుతూంది.

''నా స్నేహితురాలండీ — పేరు ప్రసూన. ఒకటి నుండి ఏడో తరగతి వరకు కలిసి చదువుకున్నాం. కలిసి తిరిగినది ఏడు సంవత్సరాలే అయినా ఏడడుగుల అనుబంధం లాంటిది మా స్నేహం. ఒక కంచంలో తిన్నాం—ఒక మంచం మీద నిద్రపోయాం''— మా శ్రీమతి చెప్పుకుపోతూంది ఆఫీసు నుండి వచ్చి ఇంట్లో అడుగుపెట్టగానే.

ప్రసూనను చూడగానే స్థాణువునై పోయాను. ప్రసూన పరిచయ వాక్యాలు మా శ్రీమతి నోటి నుండి వింటానని నేను కలలో కూడా ఊహించలేదు.

ఆ తరవాత రెప్ప వేయకుండా ప్రసూన వైపు చూస్తూ నిలబడి పోయానేమో శ్రీమతి చెబుతున్నమాటలు నా చెవిలో పడలేదు. గతాన్ని నెమరువేసు కోడంలో లీనమైపోయింది మనస్సు... పది సంవత్సరాల క్రిందటి మాట—

విజయనగరం మహరాజా కాలేజీలో బి. ఎ. చదువుతున్న రోజులు—సాయంత్రం చల్లగాలికి పార్కువరకు వెళ్ళి ఇల్లు చేరుకున్నానో లేదో — ''మాస్టారూ, ప్రాబ్లమ్సు రాక అర గంట నుండి కుస్తీ పడుతున్నాను. నా అవస్థ చూసి 'ఎదురింట లాసిల్దార్ గారి అబ్బాయి బి.ఎ. మేథ్సు' అనివిన్నాను. అడిగితే చెప్తారేమో — అంది. మన్నిమా. పర్మిషన్ దొరికింది కదాఅని పరుగెత్తు కొచ్చాను.'' నవ్వుతూ కూలబడింది ప్రసూన.


ఇంటర్ సెకండియర్ అని పుస్తకం చూసి తెలుసుకున్నాను.

ప్రాబ్లమ్సు సాల్వ్ చేయటానికి ఎక్కువ టైము పట్టలేదు.

''చాలా థాంక్సండీ, మీ మేలు ఎన్న టికీ మరచిపోలేను. సందేహాలు ఉంటే అప్పుడప్పుడు వస్తుంటాను. అభ్యంతరమా?'' సూటిగా నా ముఖంలోకి చూసింది నోట్ బుక్ తీసుకుంటూ.

''అభ్యంతరం దేనికి? అయినా మీ కా శ్రమ ఎందుకు? నేనే మీ ఇంటికి వస్తాను, కబురుపెడితే.''

''అయ్యో, పాపం— మీరు చాలా మంచివారండీ—మెనీమెనీ థాంక్స్'' సోఫా నుండి లేచి పుస్తకం పుచ్చుకుని లేడి పిల్లలా వాళ్ళింటి వైపుపరుగెత్తే ఆమెను




WH. 5471

చూస్తుంటే 'రవివర్మకే అందని అందాల రాశివో' అన్న బాలసుబ్రహ్మణ్యం పాట జ్ఞప్తికి తెచ్చుకోకుండా ఉండలేక పోయాను . . . .

ప్రసూన తరుచు ఏదో ఒక సాకుతో మా ఇంటికి వస్తుండేది. నేను రోజుకు ఒకసారైనా వాళ్ళింటికి వెళ్ళి ప్రసూనతో కాస్సేపయినా మాట్లాడక పోతే మనస్సు స్థిమితంగా ఉండేది కాదు.

ప్రసూన తండ్రి కన్ను మూసి రెండు సంవత్సరాలైందట. ప్రభుత్వం ఇచ్చే ఫామిలీ పెన్షన్‌తోను వారి గ్రామంలో ఉన్న రెండెకరాల భూమి మీద వచ్చే పంటతోను వారి జీవితం సాగి పోతుంది.

ప్రసూన తల్లి కమలమ్మ గారు అక్కడకు ఇక్కడకు అప్పుడప్పుడు జంటగా తిరిగే మా ఇద్దరినీ చూసి 'చిలకా గోరింకల్లా ఉన్నారు' అని మురిసి పోయేది. మేం ఇద్దరం ఒక ఇంటి వాళ్ళం అయితే సంతోషంగా కళ్ళు మూసుకోవాలనేది.

ఒకరోజు కమలమ్మ గారి అనుమతి తీసుకుని ప్రసూన నేను సినిమాకు వెళ్ళాం. అయితే సినిమాలో ఒక్క సీను కూడా నేను చూడలేదు. ప్రసూన సుందరవదనాన్ని చూస్తూ పరవశించి పోయాను. కళకళలాడే ఆమె చెక్కిళ్ళను నేనుగా నిమురుతూ కెంపురంగులో ఉన్న ఆమె అధరాలను దగ్గరకు తీసుకునే నా ప్రయత్నానికి — ఇప్పుడు కాదు—మూడు ముళ్ళు పడిన తరువాత అన్నట్టు కళ్ళతో సంజ్ఞ చేసింది, ఆ చీకటి వెలుగులో ప్రసూన.

ఇంటర్మీడియెట్ పరీక్ష పాసైన తరువాత ప్రసూన బి. ఎ. లో చేరింది.

ఒక ఆదివారం సాయంత్రం షికారు కని కొత్త అగ్రహారం దాటుకుని రైలు పట్టాల మీదుగా గాజులరేవు వరకు వెళ్ళాం నేను, ప్రసూన.

నాలుగు మూలలా చీకటి తెరలు కమ్ముకున్నాయి.

''చాలా దూరం తీసుకు వచ్చేశావ్ నాకు భయంగా ఉంది—బాబూ!'' రెండు చేతులతో నా నడుముని వాటేసుకుంది ప్రసూన.

''ఎందుకు భయం? నేను లేనూ?''

గుండ్రటి ఆమె భుజాలను పట్టుకుని మరీ దగ్గరకు తీసుకున్నాను.

నా గుండెలో తలదాచుకున్న కొద్ది క్షణాలకు ఆమె ధైర్యాన్ని పుంజుకుంది.

''మా మమ్మీ నా పెళ్ళికి తొందర పడుతూంది.''

షర్టు మీది గుండీలను సరిచేస్తూ చెప్పింది ప్రసూన.

''మా ఇంట్లో నీ పెళ్ళికి తొందర పడేది మా మమ్మీ అయితే మా ఇంట్లో నా పెళ్ళికి తొందర పడేది నేను: అండర్‌స్టాండ్!'' ఇద్దరం పట్టాల మీద కూర్చున్నాం.

''మరి ఆలస్యం ఎందుకు!'' ఆమె కళ్ళలో వెయ్యి దీపాల వెలుగు కనిపించింది ఆ చీకట్లో.

''నువ్వు తొందర పడలేవని—''

''ఆడపిల్లలు తొందర పడతారేమిటి?''

''మరి మగపిల్లలే అంత వేగం బయటపడతారా?''

''రాజా! నీ ఒడిలో వాలిపోవాలని, ఇద్దరం ఒకటి కావాలని మొదటిచూపులతోనే నువ్వు నన్ను ఆకర్షించుకొన్న రోజు నుండి నిరీక్షిస్తున్నాను. కాని నాకు అంత అదృష్టమా రాజా?''

''ప్రసూనా — సినిమా డైలాగులా వద్దు మనకు. మనది నిజ జీవితం. ఇద్దరం ఒకటై పోవటానికి నాకేం అభ్యంతరం లేదు. ఆకాశంలో చంద్రుడు లేడు. చుట్టుపక్కల నరమానవుడు కాన రాడు. నిర్జన అరుబయలు ప్రదేశంలో జరగబోయే మన ప్రేమ కలాపానికి సాక్ష్యులు తారలు, గుట్టలు ఈ రెండు రైలుపట్టాలు. ప్రసూనా జాగుచేయకు! ఇక నేను కోరికల్ని అదుపులో పెట్టుకోలేను. సహనం సంకెళ్ళను తెంచుకుని అదృశ్యమైపోయింది. ఇక నన్ను ఎవరూ ఆపలేరు. రా, ప్రసూనా! ఈ క్షణం మళ్ళీ రాదు.''

ప్రసూన వైపు సీరియస్‌గా తిరిగాను.

పకాలున నవ్వింది ప్రసూన.

''అబ్బ, ఎంత ఆశ! ఈ రాజా గారి ఆజ్ఞ శిరసావహించటానికి ఇక్కడెవ్వరూ సిద్ధంగా లేరు.''

''ఇదిగో, ప్రసూనా, మరోసారి హెచ్చరిస్తున్నాను. నా ప్రయత్నానికి అడ్డు రాకు. అడ్డువచ్చావో, నిన్ను రేప్ చేసి అయినా నా కోరిక నెరవేర్చుకోగలను.''

''నీ కోరిక నెరవేర్చుకోగలవు— నిజమే. కాదనను. కాని నువ్వు నెరవేర్చుకోవు. రాజా! నన్ను రేప్ చేస్తానంటున్నావ్— రేప్ అంటే ఏమిటి? ఇష్టం లేని వారిని ఈడ్చుకొచ్చి బలవంతంగా వారిని అనుభవించడం. అంతేనా? మరి నన్ను బలవంతంగా ఈడ్చుకురాలేదే! నేనే నీ వెంట వచ్చాను— నీకే మనసిచ్చాను. నిన్నే పెళ్ళి చేసుకుంటాను. అందుకే మన ప్రేమ శాశ్వతమైనది. మచ్చలేనిది. క్షణికోద్రేకమైన ఈ కోరికలకు అది ఆహుతి కాకూడదు. అందరి సమక్షంలో మన

పెళ్ళి జరగాలి. నేను పెళ్ళికూతురుగా పందిట్లో నిలబడాలి. మంగళవాద్యాలు మారుమోగుతుండగా నువ్వు నా మెడలో తాళికట్టాలి — ఇది నా కోరిక. మా మమ్మీ కోరిక కూడా. ఎందుకో, తెలుసా రాజా! మా మమ్మీ పెళ్ళి జరగలేదు. పెళ్ళి చేసుకున్న ఒక ఆఫీసరు తనకు పెళ్ళి కాలేదని చెప్పి, నమ్మించి మా మమ్మీను లేపు కొచ్చాడట. అతను చేసిన మోసం అదొక్కటే. కాని మమ్మీకి మరే అన్యాయం చేయలేదు. పెళ్ళి చేసుకున్న భార్యకు మల్లే ఆమెకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశాడు. రెండు ఎకరాల భూమి రాశాడు. అయితే భగవంతుడే అన్యాయం చేశాడు. తాగుడికి బాగా అలవాటుపడిన మా నాన్న నాలుగు సంవత్సరాల కిందట కన్ను మూశాడు... పందిరి క్రింద పెళ్ళి కూతురుగా చూడాలన్న మా మమ్మీ కోరిక తప్పక నువ్వు తీరుస్తావన్న నమ్మకం నాకుంది. ఆ ధైర్యంతోనే నువ్వు ఎక్కడికి రమ్మన్నా నేను వస్తున్నాను. అందుకే నువ్వు నన్ను రేప్ చెయ్యలేవు, రాజా! చేస్తానంటే నేను అభ్యంతరం చెప్పగలనా?" రెండు చేతులతోను కళ్ళు మూసుకుంది ప్రసూన.

"ప్రసూనా! టేకిట్ ఈజీ — నేను ఎటువంటి వాడినో నీకు తెలుసు. మాటలు చెప్పినంత మూర్ఖంగా ప్రవర్తిస్తానా నేను? పద, మీ మమ్మీ ఎదురు చూస్తుంటారు."

రైలు పట్టాల మీద నుండి లేచి ఇద్దరం కొత్త అగ్రహారం వైపు నడక సాగించాము.

'హేట్సాఫ్ ప్రసూనా! నీలాంటి వాళ్ళు చాలా అరుదుగా కనిపిస్తారు. జంతుపోకడలు గల మగాళ్ళను మంచి మనుషులుగా మార్చటానికి నీలాంటి స్త్రీలు ఈ లోకానికి చాలా అవసరం...' మనసులో ఆమెను అభినందించకుండా ఉండలేకపోయాను.

• • •

ప్రసూన, నేను మొదటి ఆట ఇంగ్లీషు సినిమాకు వెళ్ళి తిరిగి వచ్చాము. ప్రసూన తన ఇంట్లోకి వెళ్ళి గుడ్‌నైట్ చెప్పింది.

నేను ఇంట్లో కాలు పెట్టానో లేదో గోడ గడియారం తొమ్మిది కొట్టింది. సీలింగ్ ఫాన్ బరువుగా తిరుగుతూంది. వోల్టేజి డ్రాపవుతుంటా—ట్యూబ్‌లైటు వెలగలేదు. అరవైవోల్టుల బల్బు మందంగా వెలుగుతూంది. మా నాన్నగారు—అంటే తాసిల్దార్ తిరుపతిరావు గారు కొలువుతీర్చి ఉన్నారు.

నేను వెళ్ళగానే ఆయన నా వైపు చూశారు.

'ఎక్కడ వచ్చావ్ ఇంతవరకు?' అన్నట్టున్నాయి ఆయన చూపులు.

ఇంటర్ చదువుతున్న చెల్లెళ్ళిద్దరు రెండు కుర్చీల్లో కూర్చున్నారు. అమ్మ సోఫాలో కూర్చుని దీనంగా నావైపు చూస్తూంది. అంతా మౌనవ్రతం పట్టినట్టు నోరు తెరవలేదు. శ్మశాన వాటికలా మారిపోయింది ఇల్లు.

అటు ఇటు నాలుగుసార్లు తిరిగి ఇక లాభం లేదనుకుని నాలుగడుగులు ముందుకు వచ్చి నాన్నగారు నా వైపు తిరిగి చెప్పారు:

"నీ గురించి అంతా విన్నాన్రా, అబ్బాయ్. నువ్వు ప్రసూనతో తిరగటం, ఆమెను పెళ్ళి చేసుకుంటాననటం, ప్రసూన తల్లి మద్దతు ఇవ్వడం—అన్నీ విన్నాను. చూడు, రాజా. ప్రేమలు, పెళ్ళిళ్ళు అన్నవి నవల్లో రాయటానికి, సినిమాలు తీయటానికి బాగుంటాయి. వేదికలమీద ఉపన్యాసా లివ్వటానికి ఇంకా బాగుంటాయి. కాని వాస్తవ జీవితానికి కాదు. వర్ణాంతర వివాహాలు కొట్టి పారేయమని చెప్పలేను. సమర్థించ వలసినదే! కులంతో పనిలేదని వారి స్థితిగతులు సంప్రదాయాలు కూడా పట్టించుకో నక్కర్లేదా? ఎర్రగా బుర్రగా బంగారు బొమ్మలా ఉన్న అమ్మాయిలకైతే ఇవేవీ అక్కర్లేదా? పొట్టిగా, నల్లగా ఉండి నీలాంటి కుర్ర కారుల్ని ఆకర్షించడానికి అర్హతలేని అమ్మాయిలకైతే ఇవన్నీ అడుగుతారా? వండర్‌ఫుల్! బాగుందిరా నీ వరస... ఆ ప్రసూన ఎవరు? ఆమె తల్లి స్కూళ్ళ ఇన్‌స్పెక్టర్‌తో లేచిపోయి వచ్చిందన్న సంగతి నీకు తెలుసా అని అడుగుతున్నాను. అటువంటి కుటుంబంతోనా మనం సంబంధం కలుపుకోడం? నో—నో? దటీజ్ ఇంపాజిబుల్ — ఐ కెనాట్ టాలరేట్—ఐ కెనాట్ టాలరేట్."

నాన్నగారి గుబురు మీసాలు చిత్రంగా పైకి పొడుచుకున్నాయి. ఆయన కోపంతో ఉన్నప్పుడు అవి అలాగే లేస్తూ ఉంటాయి.

"తప్పు చేసిందితల్లి—కాదనను. తల్లి చేసిన తప్పుకు కూతుర్ని శిక్షించడం న్యాయమంటారా?" ఉద్రేకం తెచ్చుకో లేదు నేను.

"నీ దృష్టిలో కాకపోయినా లోకం దృష్టిలో న్యాయమే. పరాయి వాడితో లేచి వచ్చిన ఆవిడ కూతుర్ని పెళ్ళి చేసుకుంటే నీ కంటి ఎదుటకు నిన్ను పదిమంది అభినందించవచ్చు. కాదనను. కాని నీ వెనుక యాభైమంది నానా



మాటలు అంటారు. ప్రతి మనిషికి ముందుచూపు చాలా అవసరం. నీకంటె చిన్నవాళ్ళు ఇద్దరు చెల్లెళ్ళు నీకు. వారి భవిష్యత్తు ఏమిటి? అన్నీ లక్షణంగా ఉన్నా వేలు పోస్తే కాని ఆడపిల్ల పెళ్ళిళ్ళు ఈ రోజుల్లో చెయ్యలేము. అటువంటి పరిస్థితుల్లో ఎవరో గుణం సంప్రదాయం లేని ఒక అమ్మాయిని నువ్వు పెళ్ళి చేసుకుంటే నీ చెల్లెళ్ళను చేసుకోటానికి ముందుకు ఎవరు వస్తారు? నీకు కావలసింది నీ సుఖమే అనుకుంటే నీ ఇష్టం. కాని పుట్టినప్పటినుండి నీ మీద ఎన్నో ఆశలు పెట్టుకున్న నీ తల్లికి, నాకు నీ ముఖం చూపించకు. ఎందుకంటే సమాజానికి సంప్రదాయానికి దూరమై మేము బ్రతకలేము" ఆవేశంలో నాన గారి గొంతు బొంగురు పోయింది.

చెల్లెళ్ళ చెక్కిళ్ళు కన్నీటితో తడిసి పోయాయి.

అమ్మ కళ్ళలో నీరు పేరుకుంది.

ఒక్క క్షణం నేనేమీ మాట్లాడ లేకపోయాను. నేను తీసుకున్న ఒకే ఒక్క నిర్ణయానికి ఇంతమందిని బాధ పెడుతున్నానా?! ఇంతమందిని బాధ పెట్టి నేను సుఖంగా జీవితం సాగించ గలనా?

''మీ అందరికి కష్టం కలిగించే పని నే నెప్పుడూ చెయ్యలేదు. చెయ్యను కూడా...ప్రసూనను నేను పెళ్ళి చేసు కోను—సరేనా?''

నా సమాధానం అక్కడున్న వారి నందరిని ఆనంద పరవశుల్ని చేసింది. కాని నా గుండెలో చెలరేగే మంటలు నన్ను మరొక్క క్షణం అక్కడ నిలబడనివ్వలేదు. గబగబా నా గదిలోకి నడిచి తలుపులు మూసి గడియ బిగించాను.

• • •

ఆ తర్వాత నాన్నగారు అక్కడ నుండి విశాఖపట్నం ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారు. ఆయన రిటైర్ కాకముందే సరళతో నా పెళ్ళి జరిగిపోయింది.

సరళను దూరంగా చూస్తే ప్రసూన అని పొరపాటుపడచ్చు. అసలు ప్రసూనే సరళగా నా చెంత చేరిందా అన్న సందేహం కలుగుతుంది అప్పుడప్పుడు.

సరళ నాకు అన్నివిధాల తగిన భార్య. కాని ప్రసూన నా హృదయంలో చెరగని ముద్రగా నిలిచిపోయింది.

ప్రసూన పెళ్ళి చేసుకోలేదని విన్నాను.. కాని సరళ, ప్రసూన బాల్య స్నేహితులన్న విషయం ఆదివరకెన్నడూ వినలేదు.

మళ్ళీ ఎన్నాళ్ళకు కనబడింది ప్రసూన ! పెళ్ళి చేసుకోలేదన్న కోపంతో మళ్ళీ ముఖం చూపించదేమో అనుకున్నాను.

ఈ పది సంవత్సరాల్లో బాగా చిక్కి పోయింది. అయితేనేం మొహంలోని ఆకర్షణ తగ్గలేదు.

సరళ నన్ను పరిచయం చేస్తున్నప్పుడు—మీవారా, నాకు బాగా తెలుసు అని చెబుతుందేమో అనుకున్నాను. కాని అటువంటిదేమీ లేదు. అప్పుడే వచ్చిన కొత్త వ్యక్తిని చూసినట్టు—''నమస్కారమండీ!' అంది రెండు చేతులుజోడించి

నేను మాత్రం తక్కువ తిన్నానా? ఏమీ తెలియనట్టు 'నమస్కారమమ్మా, పిల్లలంతా క్షేమమేనా?'' అని అడిగాను.

''భలేవారే, ప్రసూనకు పెళ్ళి కాలేదండీ'' అంది మా ఆవిడ.

''అయ్యో పాపం — ఎందుకని?''

''అదొక ప్రేమ కథ. మా ప్రసూన టూ సెన్సిటివ్ — ఎవర్నో ప్రేమించింది. మొదట తను పెళ్ళి చేసుకుంటానన్నాడు. తర్వాత చేసుకోలేదు. అంతా తెలుగు సినిమా కథ. కాని ప్రసూన తన హృదయంలో మరొకరికి స్థానం లేదంటూ అలాగే అవివాహితగా ఉండి పోయింది.''

సరళ మాటలు కొన్ని చెవిలోనడ్డాయి. మరికొన్ని అలాగే గాలిలో కలిసి పోయాయి. ప్రసూన నోటంట ఏ మాట రాలేదు. ఆమె చూపులు శూలాల్లా నా హృదయాంతరాళాల నుండి దూసుకుపోసాగాయి.

''ఐ సీ'' అంటూ నా గదిలోకి నడిచాను.

ఊర్నుంచి వచ్చిన స్నేహితురాలికి, ఆఫీసునుంచి వచ్చిన నాకు కాఫీ ఇవ్వాలన్న సంగతి కూడా మరిచి కబుర్లు చెప్పడంలో లీనమై పోయింది సరళ. మాటలు, సినిమాలు ఉంటే మొగుడు, తిండి కూడా జ్ఞాపకానికి రావు మా ఆవిడకు.

• • •

రేడియో కేంద్రం ఆ రాత్రి కార్యక్రమాలు ముగించి పదినిముషాలైంది.

చేతిలోని కలం ముందుకు సాగలేదు. కళ్ళు మూసుకుని పడుకుందామని ప్రయత్నించాను. కాని నిద్ర పట్ట లేదు.

పక్క గదిలో ఏకాంతంగా పడుకున్న ప్రసూనను రహస్యంగా కలుసుకోవాలన్న కోరిక చెవుల్లో జోరీగలా గింగురుపెడుతోంది.

టైము చూశాను— పదకొండూ ఇరవై.

నేను కూర్చుని ఉన్న డ్రాయింగ్ రూంకు మూడు వైపులా మూడు గదులున్నాయి. కుడివైపు నున్న బెడ్ రూమ్‌లో సరళ నిద్రపోతున్నట్లుంది. వెనుక వైపు నున్న గెస్ట్ రూమ్‌లో ప్రసూన పెట్టె బెడ్డింగు ఉన్నాయి. ఆ గదిలో ఉన్న అలికిడి చూస్తుంటే ప్రసూన ఇంకా నిద్రపోయినట్టులేదు. నా రాకకోసం ఎదురుచూస్తూ కూర్చుందేమో!

చేతిలో కలం టేబిల్ మీద పెట్టి లేచాను.

గోడ గడియారం ఠంగు మంది! తల పైకెత్తి చూశాను. టైము పదకొండున్నర.

బయట వర్షం పడుతున్నా శరీరం చెమట పోస్తోంది. ప్రసూన ఇంటికి ఎంత ధైర్యంగా వెళ్ళేవాడిని! ఆమెతో ఎంత ఫ్రీగా మాట్లాడే వాడిని! ఇప్పు డెందుకు శరీరంలో వణుకు? గుండెలో బెదురు? అడుగులు బరువుగా పడుతున్నాయి. గెస్ట్ రూమ్‌లో అడుగు పెట్టాను. అంతా చీకటి. జీరో ఓల్ట బల్బు కూడా రెస్టు తీసుకున్నట్టుంది.

నా రాక ప్రసూన ఇంకా గమనించి నట్టు లేదు. నన్ను చూడగానే లేచి రెండు చేతులతో నన్ను వాటేసుకోదూ!

'ఎన్నాళ్ళ తర్వాత మళ్ళీ కలుసుకున్నాం రాజూ' అని నా గుండెలో వాలిపోతుంది. 'రాజూ, ఈ క్షణంకోసం ఎంత కాలం నుండి వేచి ఉన్నానో నీకు తెలీదు. ఆ రోజు రైలు పట్టాల దగ్గర— ప్రసూనా, మనిద్దరం ఒకటై పోదాం— అన్నావు. జ్ఞాపకముందా? నే నప్పుడు కాదన్నాను. కాని ఇప్పుడు కాదనలేను. నీ శరీర స్పర్శకోసం నా తనువులోని ప్రతి అణువూ తల్లడిల్లిపోతూంది. రా, రాజూ— ఈ ప్రసూన నీది. ఈ రాత్రి నీది. నా కోరిక తీర్చు—నీ కోరిక నెరవేర్చుకో—' ప్రసూన నన్ను ఉక్కిరి బిక్కిరి చేస్తుంది నా ఉనికి పసిగడితే!

నే వచ్చినట్టు ప్రసూనకు ఇంకా తెలియలేదా? ఎలా తెలుస్తుంది—ఎలుకను పట్టబోయే పిల్లిలా అడుగులో అడుగు వేసుకువస్తే! అందులోనూ కటిక చీకటి!

లైటువేసి చూస్తే? —- అయ్య బాబోయ్! అవతల గదిలో వున్న సరళ

నూతన యవ్వనం పొందండి.
సంతానవంతులు కండి. చర్మవ్యాధుల
నుండి విముక్తులు కండి.



హస్త ప్రయోగము వలన కలుగు నరముల బలహీనత, శీఘ్ర స్ఖలనము, అంగము చిన్నదగుట, అవసర కాలమందు అసంతృప్తి, సంతానము లేకపోవుట, సమస్త చర్మ వ్యాధులకు అద్భుత చికిత్స. హోమద్వారా చికిత్స కలదు
ప్రతి ఆదివారము భీమవరం - షణ్ముఖలాడ్జి నందు
ఉ॥ 9 నుండి సా॥ 6-30 వరకు క్యాంపు కలదు.

డా॥ డి. మార్కండేయులు, ఆయుర్వేద భిషక్
సెక్స్ అండ్ స్కిన్ స్పెషలిస్ట్
పార్క్ రోడ్, గుడివాడ-521 301.
ఫోన్స్ : 522 అండ్ 540

యమ కింకరుడిలా దూసుకు వచ్చి జుత్తు పుచ్చుకుని గిరిగిరా తన గదిలోకి ఈడ్చుకుపోడూ?! కిం కర్తవ్యం. . . వెరీ సింపుల్ — తిన్నగా వెళ్ళు— వెళ్ళావా? మంచం మీద కూర్చో. కూర్చున్నావా?

మనసులోని మనస్సు నన్ను గైడ్ చేయసాగింది. చేతులు ఆమె శరీరం మీద పడ్డాయో లేదో భూమి దద్దరిల్లి నట్టు ఎక్కడో పిడుగు పడింది. శరీరం మీద పడ్డ చేతుల్ని పక్కకు నెడుతూ గభాలున లేచి కూచుంది ఆమె.

"ఇదేమిటండీ! మీ సరసం మరీ బాగుంది. పక్క గదిలో ప్రసూన ఉందన్న కారణంగా ఈ రాత్రయినా విశ్రాంతి దొరుకుతుందని తలచాను. పైగా ఆమె పెళ్ళి కానిది—నిద్ర పోతూందో లేదో? ఈ చీకట్లో ఏదీ కన బడి చావడం లేదు. మీరు రోజురోజుకూ మరీ కుర్రాడై పోతున్నారు. మీ సరసాలు చప్పుళ్ళు ఆమె చెవిని పడితే?— తెల్లారగానే లేచి వేళాకోళం చేస్తుంది మా ఫ్రెండు. అసలు ప్రసూనకు ఈ గెస్ట్‌రూమ్‌లో లోనే పక్క వేశాను. అరగంట కిందట ఇక్కడే పడుకుంది. నేను మన బెడ్‌రూమ్‌లో పడుకున్నా.

'నా కా గెస్ట్‌రూమ్‌లో నిద్ర పట్టడం లేదే, సరళా. నువ్వా గదిలో పడుకో, బాబూ నేను ఈ గదిలో పడుకుంటాను' అని తను మన బెడ్‌రూమ్‌లోకి పక్క మార్చింది. నేను ఇక్కడ కొచ్చి పడుకున్నాను. నేను ఏ గదిలో ఉన్నా మీరు ఇట్టే పసిగట్టేస్తారు పోలీసు కుక్కలు దొంగల్ని పట్టేసినట్టు. సరే కానీయండి నేను కాదన్నా మీరు ఆగరు కదా. ఆ తలుపునైనా మూసి రండి. ప్రసనూ లేచిందంటే పరువు పోగలదు."

సరళ నోరు తెరిస్తే గోదావరి ప్రవాహమే — అడ్డు, అపు ఉండదు.

"సరళా!...నువ్వా!" అప్రయత్నంగా అన్నాను.

"కాక ప్రసూన అనుకున్నారా?"

"కాదు, స్వీటీ — ఆ సరళ నేనా నువ్వు అని ఆశ్చర్యపోతున్నాను. ఎందుకంటే, ఏదో ఒక సాకుతో మూడంకేవేసి నిద్రపోవడం అలవాటు కదా నీకు. కాని అమాంతంగా ఈ రోజు నీ దాసుడిపై జాలి చూపినందుకు ఆశ్చర్య పోయాను... ఏమిటో ఈ రోజు ఒంట్లో బాగుండటం లేదు. నేను డ్రాయింగ్ రూమ్‌లో పడుకుంటాను. నువ్వు చక్కగా నిద్ర తీయి. ఓ. కే." నేను నిరసంగా డ్రాయింగ్ రూమ్ వైపు నడిచాను.

• •

ఆ మర్నాడు ప్రసూన తిరుగు ప్రయాణం కట్టింది. విపరీతమైన తలనొప్పితో బాధపడుతూంది సరళ. ప్రసూనను స్టేషన్‌వరకు సాగనంపడానికి నేనొక్కడ్నే వెళ్ళక తప్పలేదు.

గడచిన రాత్రి నన్ను డిజపాయింట్ చేసినందుకు ప్రసూన మీద చాలా కోపంగా ఉన్నాను.

ఆటోలో ఇద్దరం పక్క పక్కన కూర్చుని స్టేషన్‌వరకు వెళ్ళినప్పుడు కూడా మా ఇద్దరి మధ్య మాటలు కరువైనాయి.

సికిందరాబాద్ స్టేషన్‌లో ఒకటవ నంబరు ప్లాటు ఫారం నుండి గోదావరి ఎక్స్‌ప్రెస్ కదలబోయే ముందు మనస్సులో రగిలే దుఃఖాన్ని దిగమింగుకుంటూ చెప్పింది ప్రసూన —

"రాజా! నిన్ను చూడాలని వచ్చాను. కాని నీలో అణగి ఉన్న తృష్ణను తీర్చడానికి కాదు... కోరికలు నెరవేర్చుకోవాలన్నదే మనధ్యేయమైతే మనంమానవులుగానే జన్మించాలంటావా, రాజా — అన్నిటిని జయించగల శక్తి నీకుంది. క్షణకాలపు సుఖంకోసం నువ్వు తప్పటడుగు వేయటం నేను సహించలేను. నా దృష్టిలోనే కాదు, అందరి దృష్టిలోను నువ్వు రాజువే. అందుకే నీ కందకుండా నిన్న రాత్రి గెస్ట్‌రూమ్ నుండి పక్క గదిలోకి మారిపోయాను. నేను చేసింది పొరపాటంటావా? నా మనస్సుని అర్థం చేసుకున్నా వనుకుంటాను. నీ మనస్సుకు సంతోషాన్ని కలిగించలేక పోయాను. నన్ను క్షమించు, రాజా!"

రైలుపెట్టెలో కిటికీ ప్రక్కన కూర్చున్న ప్రసూన ప్లాటుఫారం మీద నిలబడి ఉన్న నా రెండు చేతుల్ని పట్టుకుంది.

బండి కదలి వేగాన్ని పుంజుకోవటానికి సిద్ధమవుతుండగా ఆమె రెండు చేతులు అప్రయత్నంగా నాకు దూరమైనాయి.

క్షణక్షణానికి మా ఇద్దరి మధ్య దూరం నిత్యావసర వస్తువుల ధరల పట్టికలా పెరిగిపోసాగింది.

బండిని అందుకోలేని ప్రయాణికుడిలా ప్లాటుఫారంమీద శిలాప్రతిమై నిలబడిపోయిన నన్ను చూస్తూ చెమ్మగిల్లిన కళ్ళను తుడుచుకుంది ప్రసూన. ★


"ఒసేవ్ దయ్యమా! నీకు ధైర్యం వుంటే నాకు కనబడు. నిన్ను నేను పెళ్ళి చేసుకుంటాను. నీ చేత మా యింట్లో అంట్లు తోమిస్తాను" మేమిట్లా అంటూవుంటే గదిలో వికృతమైన నవ్వు వినిపించింది. గది అంతా నవ్వినట్లుంది........

చదువుతూంటే ఒళ్ళు గగుర్పొడిచే యదార్థగాథ. పేరొందిన నేటి రచయితలకు కూడా ప్రేరణ కలిగించిన

కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారి విచిత్ర సాహిత్య ప్రయోగం.

**బాణావతి** బాపు ముఖచిత్రముతో పునర్ముద్రణ వెల: 20-00

దీనితోపాటే మరొక చక్కని తెలుగు నాటకం

**గుప్తపాశుపతము** బాపుముఖచిత్రముతో ప్రథమ ముద్రణ వెల: 6-00

విశ్వనాథవారి షష్ఠ వర్ధంతి సందర్భంగా అక్టోబర్ 18 న విడుదల. వెంటనే మీకాపీలు రిజిరువ్ చేసుకొంటే రెండూ కలిపి ... 21/- కే

వెంటనే రు.20-00 M.O గాని, డ్రాఫ్టు గాని పంపండి. ఆ పైరూపాయికి పుస్తకములు మీ చేతిలో వుంటాయి

ఈ అవకాశం అక్టోబర్ 31 వరకే.

Dolphin

**విశ్వనాథ పావని శాస్త్రి**
c/o V.S.N & CO
మారుతీనగర్
విజయవాడ-520004
ఫోన్: 61378